పెద్దకథ

సుప్రభాతం

కీ.శే. వాసుదేవరావు

"అట్లయిన నీవు నా మాట వినవు?"

"ఎన్నిసారులు చెప్పవలెను. నా మనోరథము, నా మనోగతము. ఇదివర కెన్నిసార్లు చెప్పి యుందునో. ఇంకను నట్లే యడిగిన నేమి చెప్పుదును?" అని కమల కనుబొమలు ముడివడ నసూయతో ననెను.

"అదికాదు; కమలా! మూర్ఖపుఁ బట్టుదల వలన, అవివేకమున సాధారణముగాఁ జేయుపను లనాలోచిత కృత్యములై పోవును. ముందుగానే ముందు వెనుక లాలోచింపకున్నఁ బిదపఁ బశ్చాత్తాపమునకుఁ బాలుకావలసివచ్చును. కావున, నీ విషయమున నట్లు కానీక పూర్ణముగా విచారణ చేసియే - ఆలోచించియే - చేసి_"

"లేదు_లేదు. కృష్ణారావు, నేఁ జేసినది పూర్ణాలోచనానంతరముననే; పశ్చాత్తాపమునకుఁ గారణ ముండదు" అని కమల నిశ్చయాత్మక స్వరమున ననెను.

"నీ కట్లు తోఁచుచుండును; కాని, నీ యీ యవిచార కృత్యమువలనఁ దప్పక నీకుఁ బశ్చాత్తాపము కలుగక మానదు. నీవు గొప్పవారి యింటి బిడ్డవు; విద్యావతివి; జ్ఞానవతివి; సురూపవతివి. ఇట్టి నీవు కాసుకుఁగొఱగాని బిచ్చగాని_ పొట్టకూటికై పరులకొంపల నాశ్రయించు గర్భదరిద్రుని_ ప్రేమించి వరించుట యన_"

"ఇదుగో, కృష్ణరావూ, పవిత్రమగు ప్రేమకుచ్చనీచ భావములు లేవు. అది శ్రీమంతుల కడనే యుండవలయునని నియమము లేదు. పటాటోపము నవలంబించి యుండదు. గొప్ప వంశములోనే పుట్టవలయు ననుటను బట్టియు నుండదు. కాని దానికిఁ బరస్పర గుణ స్వభావ ప్రియతమే ముఖ్యము. విపులధనముండియు, గొప్పవంశమునఁ బుట్టియుండియు, భార్యాభర్తల గుణ స్వభావములలో భూమ్యాకాశముల కున్నంత యంతరమున్న నేమి లాభము? ఇట్టియెడ నిద్దఱకు సుఖ మొదవుట యరుదు. అరు దేటికి? - సౌఖ్యమే లేదు. కావున, నేనా ధనమును, వంశమును బట్టికొని కూర్చుండుటలో నర్థము లేదు. అవి నాకనవసరములు."

"నీకు నాపైఁ బ్రేమ లేనేలేదు?"

"మరల మరల నా మాటయే యుచ్చరించుటకు నాకే సిగ్గగుచున్నది."

"కమలా, యింక నొకమారు నొక్కి చెప్పుచున్నాను. బాగుగా నాలోచింపుము; పిదప నేమి ప్రత్యుత్తరమిచ్చెదవో యిమ్ము."

"అవసరము లేదు. ఇంకను నేనాలోచింపవలసిన యవసరము లేదు; నా యీ నిశ్చయము నిశ్చలము."

కృష్ణరావున కధిక సంతాప మొదవెను. ఆ క్రోధ భరమున నాతఁడిట్లని పలికెను:

"నీ నిశ్చయము చలింపదు కదా? చాలును. నీ తండ్రి యా దరిద్రునకు నిన్నిచ్చి వివాహము సేయ నెట్లంగీకరించునో చూచెద. మీ తండ్రి వలననే నీ యీ దృఢ నిశ్చయమును మార్పింపకున్న నన్ను మారుపేరునఁ బిలువుము."

కమల కిప్పు డధికతరకోప ముదయించెను. ఆమెయు నట్లే గంభీరముగ నీరీతిని బలికెను.

"నీ యీ బెదిరింపుల నే నణుమాత్రమును లెక్కసేయను. బాబాదగ్గర నీ యాటలు సాగవు. నా యీ దృఢ నిశ్చయము నాన్నగారికిఁ దెలియకుండలేదు. బాబాయు నందున కంగీకరించియే యున్నారు. కావున, నిప్పుడు నీవు వచ్చిన త్రోవఁ బట్టి పోయెదవా, బాబాను బిలువవలెనా?"

"ఏమి? ఇంత పరాభవమా? నీ వలననా?"

"ఔనౌను. నా వలననే! నీవే మనుష్యుఁడవై యుండిన, మరలమరల నిట్లు సిగ్గులేక యిక్కడకు వచ్చుచుండవు!"

"ఏమి? నీ వీమాట లెవరికిఁ జెప్పుచుంటివి? ఈ కృష్ణరావుకే?"

"అవును అవును. నా కన్నెదుట నిలిచియున్న యీ కృష్ణరావునకే నా యీ గదిలోనికి వచ్చుటకు నీ కెట్టి కార్యములును లేవు. ఎవరును నిన్నిక్కడికి రమ్మని పిలువలేదు. వచ్చినట్లే తిరిగి పోయెదవా లేక——" అని కమల సంతాపోద్రేకమున ననెను.

"ఇటు చూడు, కమలా! అయినదేమో యైపోయినది. ఇట్లు కోపింపకుము. నా యీ యొక్క మాట — కాదు విన్నపము— మన్నింపుము. నా విన్నప మాలించి మన్నించితివా, నా ప్రాణము లున్నంతవఱకు— అటుపై సైతము నీకెట్టిలోటు నొదవ నీయను. ఇంకను నధికముగాఁ జెప్పనేటికి? నీవు నా శరీరమందలి మాంసముఁ బిడికెడు గోరినను విచారింపకయే యీయఁగలను. నీపై నాకెంత ప్రేమకలదో మాటలతోఁ జెప్పనలవి కాకున్నది. నా యీ హృదయ కవాటమును తెఱచి చూచిన, నచట నీ యందలి ప్రేమతక్క వేఱొకటి నీకుఁ గానఁరాబోదు. నీవు నన్ను నిరాకరించితివా; నా జీవితము పాషాణ ప్రాయమగును. నీ వంగడమును, మా వంగడమును గూర్చి పోల్చి చూడుము; ఆలోచింపుము. ఇరువంగడములను సమానముగాఁ దులదూచి చూడుము. ఆహా! ఇట్టియెడ నీ మెదడున నీ భ్రమ యెట్లు చొచ్చెనో కదా! నీవు నేను నొక్కచోట నాటలాడుచుంటిమి; ఒక్కచోటఁ బెరిగితిమి. అప్పటినుండియు నిన్నే తీరునఁ బ్రేమించుచుంటినే యాలోచింపుము. నన్ను భగ్నాశునిఁ జేయుట నీ యట్టి సుశీలకు, సద్గుణరాశికి, వివేకవతికి ఉచితమగునా?

తన పలుకు లెట్టి పరిణామ మొదవించునో చూడఁగోరి కృష్ణరా వీవిధముగ శాంతముతోఁ బలుకుచుండెను. కాని, యిద్దానఁ గమలహృదయము కరఁగదయ్యెను; సమాధానము కాకపోయెను. కాని యితని యీ లజ్జారహిత వర్తనమున కామె కధిక కోపము, నసూయ కలిగెను. ఆమె తుద కసూయతో నిట్టులనెను:

"కృష్ణరావూ, నీకుఁ జెప్పవలసిన దేదియో యొక్కమారే చెప్పి వేసితిని. ఇంక నూరకే నా కాయాసము కలిగించుటలో - చెప్పినదానినే మరల మరల చెప్పించుటలో - లాభ మేమున్నది? ఇట్టి యవివేకపుఁ బలుకులు, ఆచరణము నీకుఁదగునా? ఇఁకనైన నాయందుఁ గృపయుంచి నన్ను వీడిపొమ్ము."

"ఏమి? నిను వీడి పొమ్మనుచున్నావా? ఇదిగో పోవుచున్నాను. మదినుంపుము."

"చక్కఁగా నుంతును!"

కృష్ణరావు తన తీక్ష్ణకటాక్షము లామెపైఁ బరపి మీసము దువ్వి, పండ్లు పటపటమని

కొఱుకుచుఁ గోపావేశముతో వెడలిపోయెను.

*   *   *

అప్పాజీపంతు పునహా మండల న్యాయ స్థానమున నొక్క సుప్రసిద్ధ న్యాయవాది. ఇతనికి వృత్తిలో విపుల ధనము లభించుచుండెను. అంతయే కాక పునహా నగరమున నితని కొక పెద్ద యిల్లును, మిక్కుటమగు చరాస్తియు నుండెను. అతని కేకొఱంతయును లేదు; కాని, తన యనంతర మీ విపులసంపదకుఁ దగినవారసుడు లేకపోయెనను విచారమువాత్ర మాతని విడువక యుండెను. అయినను నాతని కొక్క పుత్రిక మాత్ర మున్నది. ఆమెయే మనము ప్రథమ ప్రకరణమునఁ జూచిన కమల. అప్పాజీ పంతునకు వయసు నట్టే ముదిరియుండలేదు. నలువదైదు నలువ దాఁటేండ్లుఁడును. కాని, కమల కనంతరము పదేను పదాఱు వత్సరముల వఱకు నే సంతానముఁ గలుగ కునికి, నికఁ గలుగునను నాసయే లేదు. కావున నాతఁడును, నాతని భార్య లక్ష్మిబాయియు, నాతని తల్లి రమాబాయియు నీయొక్క బాలిక కమల నత్యంత ప్రేమతోఁ బెంచుచుండిరి. ఈ బాలికయం దనేక సద్గుణము లుండెను. అతుల రూపవతి. రూపమున కనుగుణ్యముగనే యామె విద్యను నార్జించి సుసంస్కృతయై యుండెను. లక్ష్మిబాయి యీ బాలికను గృహకృత్య నిర్వహణము నందును సుశిక్షితను జేసియుండెను. ఇట్టి యాసుత పరగృహవాసమున కరుగునుగదా యని తోఁచి నపుడెల్ల నా యింట నందఱకు మిగుల వ్యాకులమగు చుండెను. కాఁబట్టి యా బాలికకుఁ బదియా ఱేఁడులు వచ్చినను బెండ్లిమాటయే యెవ్వరును దలపెట్టరైరి. అప్పాజీపంతు నూతనా చారపరులలోఁ బ్రముఖుఁడు. మాటలచే మాత్రమే కాదు; క్రియా రూపముననను నట్టివాఁడె! ఇంట నితని కెదురాఁడు వారెవ్వరును లేరు. కావుననే యతని తల్లియు, భార్యయు నతనికి వ్యతి రేకమ గాఁ బలుకరైరి. అయినను, బదియే నేఁడులు వచ్చినప్పటి నుండియుఁ దల్లియుఁ, బత్నియు నీతని వెంటఁబడిరి. "ఇఁకనైనను బెండ్లి సేయకున్న నెట్లు? ఇంక నెంతకాల మీదేరిన పిల్ల నింట నుంచు కొనవచ్చును! లోకమునకు వెఱవకపోయినను, సంఘమునకు వెఱవకపోయినను, బుద్ధి తెలిసిన పిల్ల — —" ఇంక నేమేమియో యను చుందురు. అన్నిటికిని మన యప్పాజీపంతు తల నూపుచు "ఆఁ, త్వరలోనే చేసెద. నేను నా విచారముననె యున్నానని" సమాధాన పఱచుచుఁ గొంతకాలము గడపెను. యదృష్ట వశమున నప్పాజీపంతునకుఁ గమలకై నరుని వెదక వలసిన యవసరము కలుగలేదు. తన మనసున కెక్కిన వరునొక్కని నాతఁడు మనసున నిర్ణయించి యుండెను.

అప్పాజీపంతు నాశ్రయమున వినాయకుఁడను యువకుఁడు విద్యాభ్యాస మొనర్చుచుండెను. ఈ యువకుఁడు పసితనముననే తండ్రికి దూరమై పోయి, డక్కరియుండ, నప్పాజీ మిత్రు లొక కొందఱీ బాలుని నీతని యింట నుంచుకొనఁ బ్రార్థించిరి. పంతు నందున కంగీకరించి, యా బాలున కాశ్రయ మొసంగి పుత్త్రునివలెఁ బెంచుచుండెను. ఈ బాలుని చాకచక్యము, విద్యార్జనాపేక్ష, వినయశీలస్వభావముఁ గని యా యింట నందఱకు నాతనిపై నధికానురాగ ముదయించెను. ఈ కుఱ్ఱఁడును దన సుగుణ సంపదలచే నెల్లర డెందముల నాకర్షించికొనెను. ఈ విధముగా వినాయకుఁ డుత్తమ విద్యావంతుఁ డయ్యెను. చిరపరిచయము మూలముననను, నేక స్థాన నివాసము మూలముననను జిన్ననాఁటినుండియే కమలా వినాయకు లమితానురాగ బద్ధులై మెలఁగు చుండిరి. వయసు పైఁబడిన కొలఁది ఆ యను రాగము దృఢమై ప్రేమగమారి, యా యిరువురును లోలోననె యనేక విధముల నువ్విళు లూరు చుండిరి. చాణాక్షుఁడగు నప్పాజీ పంతున కెట్లో యీ విధము తెలిసెను. అతఁడును లోలోననె యానందించుచు మిన్నకుండెను. ఇఁక వర శోధనావశ్యకత లేకపోయినందుకు మిక్కిలి సంత సించెను. ఇట్లు కొంత కాలముఁ గడువ నీ రహస్య మింటను దెలిసెను. అందఱు నిందున కను కూలురై యుండిరి.



అప్పాజీపంతు నింటి పొరుగింట సదాశివరావను గృహస్థుఁడు నివసించుచుండెను. ఈ గృహస్థుఁడు మాది వర్తకమున మిగుల ధనవంతుఁడై యుండెను.

ఈతనికిఁ గృష్ణరావను పుత్త్రుఁ డొకఁడుండెను. కృష్ణరా వీలోకమున నవతరించిన వెంటనె తల్లి పరలోకముఁ జేరెను. తల్లిలేని బిడ్డఁడని తండ్రి మిగుల గారాబమున నీ బాలునిఁ బెంచెను. అతఁడు పోయినదే త్రోవ! పలికినదే పలుకు! ఈ విధమునఁ బెరుగు చుండెను. ఆంగ్ల విద్యలో నాలుగైదు తరగతులు చదివి పాఠశాల వదలి వేసెను. పగటి వేళల ద్యూత క్రీడలందును, రాత్రి వేళల నాటకములు, ఉత్సవములు, పాట కచ్చేరీలు మొదలగు నన్యవ్యవసాయములఁ గాలముఁ గడుపసాగెను. ఇన్నిమాట లేటికి? కృష్ణరావునకు నింట నిర్బంధము లేకపోవుట చేతను, దగిన శిక్షణము లేకపోవుటచేతను, నానావిధ వ్యసనములలోఁ జిక్కి సదానంద తన్మయుఁ డయ్యెను. ఇరుగింటనున్న సుందర తరుణి తనకుఁ బత్ని కావలయునని యతఁ డిచ్ఛవహించెను. నిజముగనె యతనికిఁ గమలపై గాఢానురాగ ముదయించెను. కాని, యా ప్రేమను బరీక్ష చేసినచో 'విషయోద్భూత' మనియె తేటబడి యుండును. నిజము దేవున కెఱుక! ఈ విషయము తండ్రి కెఱింగింప నాతఁ డప్పాజీపంతుకడఁ బ్రస్తావించెను. కాని, పంతు "సకల భారమును గమలయే వహించియున్నది. సకలముఁ దన యిష్టానుసారము జరుపుకొనును. ఇందున నే నేసంబంధమును గల్పించుకొనలే" దని స్పష్టముగాఁ దెలిపినందుపై, సదాశివరావు హతాశుఁడై యూరకుండెను. తుద కొకనాఁడు కృష్ణరావు స్వయముగనే యేకాంతమునఁ గమలను సందర్శించి, తన కోరిక వెల్లడించెను. అప్పుడతని కెట్టి ప్రత్యుత్తరము లభించినదియు, నే విధముగ హతాశుఁడైనదియు, భగ్న హృదయుఁడైనదియుఁ బ్రథమ ప్రకరణమున నుడువఁబడియున్నది.

అనంతరము గొలఁది దినములలోనే కమలా వినాయకులకుఁ బ్రియమైనట్టియు, గృష్ణరావున కప్రియమైనట్టియు వివాహమయి, కమల యభీప్సితము సిద్ధించెను.

* * *

కమలా వినాయకులకు వివాహమై యైదు సంవత్సరములు గడచినవి.

అప్పాజీ పంతులుగారి శ్రద్ధాభక్తుల మూలమున వినాయకరావున కుత్తమ విద్య లభించి బి. ఏ., యల్. యల్. బి., పదవి లభించుట, గని యప్పాజీపంతునకుఁ దన శ్రమయు, ధనవ్యయము సార్థకమయినదని మిగుల నానందము కలిగెను. సంఘమునకుఁ గీటకమగు కృష్ణరావు మూలమున, ప్రోత్సాహమునఁ గమలా వినాయకుల కనేక సంకటము లొదవుచుండెను. సాటి వారల వలన వీరి కనేక సంకటము లొదవెను. వాని నన్నిఁటిని మిక్కిలి యోర్పుతో నోర్చియుండిరి. మదగజమును గని శునక మెంత మొఱిగిన దాని కేమిలోటు కమలా వినాయకు లీ మొఱుఁగుఁ గుక్కల బెదరింపుల కణుమాత్రముఁ జలింపరైరి.

వినాయకరావునకు న్యాయవాది పట్టము లభించిన వెంటనే రెండు సంవత్సరములకు బరోడా సంస్థానమున న్యాయ శాఖలో నొక గొప్ప యుద్యోగము లభించెను. అతఁడుద్యోగమునకుఁ బోవుట కిదియే మొదటిసారి యగుటచేఁ దా నొక్కఁడేపోయెను. కమలను దీసికొనిపోలేదు. ఆ సమయమునఁ గమల యించుక యనారోగ్యమున నుండెను. అంతయే కాక క్రొత్తయూరు, తగిన వసతి మొదలగునవి ముందు ఏర్పఱిచిన పిదప పిలిచికొనిపోవ నెంచియుండెను. కాని, మన మొకటి సేయనెంచిన నది వేఱొకటి యగుచుండును గదా! ఆ రెండు సంవత్సరములును గమల కా నూతన సంసారశకటము నడిపించు నవకాశము లభింపలేదు. కమల యనారోగ్యవతియై యుండి కొంచెముగ నిమ్మళించి. లేచి యటునిటుఁ దిరుగఁ బ్రారంభించిన వెంటనే లక్ష్మీబాయికి మన్యపుజ్వరము తగిలెను. అందుండి యామె యించుక యారోగ్యము వడయుచుండ నప్పాజీ పంతునకు సంధివాతము సంప్రాప్తమయ్యెను. ఇట్టి సంకటములలోఁ దలిదండ్రులను విడచి మగని కాపురముదిద్దఁ బోవుట కా యువతి కవకాశము చిక్కదయ్యెను. వినాయకరావు మాత్ర మప్పుడప్పుడు సెలవుదీసుకొని యిక్కడికి వచ్చుచుఁ బోవుచుండెను. అదియుఁ గాక కమల పితృగృహ నిర్వహణ భారమంతయుఁ దానవహించి మిగులఁ జతురతతోఁ జరుపుచుండుటచే వినాయకరావున కట్టె యధికముగా సెలవుదీసుకొని వచ్చి యింటనుండ నవసరము లేకపోయెను. ఇప్పుడు రోగము అప్పాజీపంతులు గృహమును త్యజించి పోయెను. దీపావళి సమీపించుచుండెను. ఈ పండుగున కల్లుఁడువచ్చును మరలిపోవునపుడు కమలను బంపవలయునని యప్పాజీపంతు నిశ్చయించి యుండెను. కమలకు వివాహమైన దాది నేవో కారణముల మూలమున అనేక విఘ్నము లొదవుటచే నొక్క దీపావళి పండుగయుఁ దగినరీతి జరిపి యుండలేదు. దీపావళి యల్లుండ్ర పండుగు కదా! ఈ మారు తమ యింట నెల్లరు సుఖరూపమున వచ్చిన కష్టములన్నియుఁ దొలగి లేచుటచే నీ పండుగు మహావైభవముతో జరుప నిశ్చయించి యుండిరి. సకలము నొక పక్షము దినములకు ముందే సిద్ధపఱచుచుండిరి.

దీపావళి యింక నెనిమిది దినములే యున్నది. అప్పాజీపంతు తన మనోగతము నెఱింగించుచుఁ దమ బంధుమిత్త్రాదులతో రావలయునని వినాయకరావున కాహ్వానము బంపెను. ఇంట సర్వము నిండియున్నది; ఆనందము తాండవ మాడుచున్నది. పెండ్లియింట సైతమిట్టి కోలాహల ముండదు.

వినాయకుని వృద్ధమాతకును, వితంతువై నిరాధారయై యున్న యమునకును బత్రికలు లిఖించిరి. కాని, వృద్ధమాత గోపికాబాయి "నాకు దేహమనారోగ్యముగ నుండుటచే నేను రానందుకు విచారమగుచున్నది. యమునను బంపుమనన్న నాకిక్కడ నుపచారము సేయువారెవ్వరును లేరు" అని ప్రత్యుత్తరము పంపెను. అన్నిటికిని వినాయకుఁడె ముందునకు రావలసి వచ్చెను. గోపికాబాయి వృద్ధయౌటచే నీ ప్రయాణశ్రమ కోరువఁజాలదని పం తెఱిఁగి యుండెను. అయినను వాడుక చొప్పున నుత్తరము వ్రాయవలసి వ్రాసెను.

తన యాంతరంగిక మిత్రులలో నొకరిద్దఱిఁ గలిసి ధనత్రయోదశినాఁటి రాత్రి ఘనహాకు వచ్చెదనని వినాయకరావు కడనుండి యుత్తరము వచ్చెను.

రేపు ధనత్రయోదశి; రేపు రాత్రి వినాయకరావు వచ్చును. కావున నింట నందఱును మహదానందసాగరమున నీఁదుచుండిరి. ఇఁకఁ గమల మాటఁ జెప్ప నేటికి? "ఎప్పు డీనాఁడు గడచి తెల్లవారునా, ఎప్పుడు రేపు పవలు గడచి రాత్రి యగునా, ఎప్పుడు తన ...... వచ్చునా? ఎప్పుడు తాను లజ్జావనతవదనయై హారతి యిత్తునా?" అని యీ తీరుగ మనమున ననేక విధములఁ దలపోయు చుండెను. ఆమె యానందము స్వర్గమును ముట్టియుండ వచ్చును. ప్రతి క్షణము నీమె లెక్కించు చుండెను. ఎట్టెట్టో ధనత్రయోదశి యుదయమయ్యెను. నేఁడు కమల యానందమునకుఁ బారమే లేకపోయెను.

దీపావళి నిమిత్తమై గ్రహ ముత్తమరీతి సుశోభితమై యుండెను. అందునను ముందరి చావడి మిక్కిలి యింపుగా శృంగారింపబడి యుండెను. సాయంకాలమయ్యెను. అప్పాజీపంతు తన బండినెక్కి స్టేషనుకుఁబోయెను. ధూమశకట మానాడు కొంచె మాలస్యముగ వచ్చునని తెలిసెను. అంతఁ బంతు తన బండిని, సేవకుని స్టేషనున వినాయకునికొఱ కుంచి తానొక బాడుగ బండిలో నెక్కి యింటికి వచ్చి చేరెను. బండి వచ్చు వేళయు నయ్యెను. కమల వినాయకుని వచ్చు త్రోవయందు దృష్టి యుంచి యుండెను. బండి చప్పుడు వినవచ్చెను. తన భర్త వచ్చెనని యామె వీధివంకఁ జూచెను. ఆ బండి యట్లే వెడలిపోయెను. ఈ విధముగ నెన్నియో బండ్ల చప్పుడు వినవచ్చెను. ఒక్క బండియుఁ దమ యింటికడ నాఁగలేదు. చాలఁ ప్రొద్దువోయెను. బండి రాలేదు. వినాయకరావును రాలేదు. ఇంకను బదిపదేను నిమిషములు వేచి యుండి పంతు దుస్తులను ధరించి స్టేషనుకు వెడలెను. అచట జనసమ్మర్దము తగ్గియుండెను. అచట విచారణ చేసెను. బండివచ్చి వెడలిపోయియు నొక గంటసేపైనది. ఈ బండిలో వినాయకరావు రాలేదు. భగ్నహృదయముతో నాతఁడింటికి మరలి వచ్చెను.

వినాయకరావు రాకుండుటచే నింట నెల్లరకు ముఖ్యముగాఁ గమలకు మిక్కిలి విషాద ముదయించెను.

"వత్తునని తెలిపిన పిమ్మట నాతఁడు రాకుండువాఁడు కాఁడు. ప్రయాణ సమయమున నేదైన విఘ్న మొదవినదను కొందమా ఆ వెంటనే 'టెలిగ్రా' మిచ్చి యుండునే! టెలిగ్రామును రాకుండుటచే నాతని కీబండి మిగిలిపోయి యుండ

(60వ పేజీ చూడండి)

(22వ పేజీ తరువాయి)

వచ్చునని యూహింపవలసి యున్నది. నేఁటిబండి మిగిలిపోయినందునఁ దప్పక యుదయపు బండికి వచ్చును." అని యప్పాజీపంతింట నందఱను సమాధానపఱచెను.

అందఱును నమ్మిరి. ఆ రాత్రి గడపుట కమలకెంతో కష్టమయ్యెను. 'ఎప్పుడు తెల్లవారునా' యని కన్నులు మూయకుండెను. అనేక విధ పరస్పర విరోధ కల్పనా తరంగ డోలికలలో నూఁగుచు నామెయుండ నెట్లో తెల్లవారెను. నేఁడు నరకచతుర్దశి యగుట జనులందఱు నరుణోదయాత్పూర్వమె మేలుకొనిరి. అందందు నపూర్వానందోత్సాహములు తాండవమాఁడుచుండెను. అనేకులు మంగళస్నానము సేయుచుండిరి. స్నానానంతరమున సుగంధ ద్రవ్యములు మేనులకు రాచి, నానావిధామూల్యాంబరాభరణములు గైసేసి నగర నారీ వరగణములు దేవతా దర్శనమున కరుగుచుండిరి. ముందటి వాఁటివలెనె యప్పాజీపంతు స్టేషనుకడకు వినాయకరావు కొఱకు బండి నంపియుండెను. బండిపోయియు రెండుగంటల కాల మయ్యెను. వినాయకరావు రాలేదు. అప్పాజీపంతు గృహమున నందఱకు విచారమయ్యెను; చింతింపసాగిరి. నేఁటిదినము మహదానందమునఁ గడుప సర్వసన్నాహములతో నుండ, దీర్ఘకాలమునుండియుఁ గోరుచుండు నీ కోరిక ఇప్పుడు నష్టమైనందున నెల్లరకు మిక్కిలి దుఃఖమయ్యెను. కమలాహృదయమో — ఆ స్థితిలో నుండువారలకే తెలియవలయును!

ఇంకను రెండుగంటల కాలము గడచెను. అప్పాజీ పంతు విషణ్ణహృదయముతోఁ జావడిలో నొకపడక కుర్చీయందుఁ బరుండి విచారమగ్నుఁడై యుండెను. 'టెలిగ్రాఫ్' కచేరినుండి యొక భటుఁ డొక 'టెలిగ్రా'మును దెచ్చి యాతని చేతికిచ్చెను. దస్కతుచేసి భటునిఁ బంపివేసి యా 'లకోటా'ను జేతఁబట్టికొనెను. దానిని విప్పుట కతనికి ధైర్యము కలుగలేదు. టెలిగ్రాము వచ్చిన తోడనే యతని డెందము పరిపరివిధాలోచనా కల్లోలములతో నిండిపోయెను. అనేక విధములగు కుశంక లుదయించెను తుద కెట్టకేలకెట్లో మనసును బిగఁబట్టి దాని విప్పిచూచెను. ఆ వెంట నాతఁడు పాషాణవిగ్రహమువలె నిశ్చేష్టుఁడయ్యెను! శరీరమున రోమాంచములు నిక్కఁబొడిచెను! చేతిలోని కాగితము జారి నేలఁబడియెను. ఈ విషయ మింట నెవరికిని దెలిసియుండలేదు. సేవకున కొకనికి మాత్రము తెలిసియుండెను. వాఁడును బెగడొంది యేమియుఁ జేయఁజాలక, లోనికరిగి, మెల్లఁగ లక్ష్మీబాయికిఁ జెప్పెను. ఆమెయు నాక్షణమె బయటికి వచ్చి భర్తస్థితిఁగనెను. ఆమెకు గుండెలు చెదరిపోయెను. కాళ్ళు నిలువఁజాలక పోయెను! నోరెండిపోయెను. మొగము వాడిపోయెను. స్వల్పకాలముననె యింటనందఱకు నీ టెలిగ్రాముసంగతి తెలియవచ్చెను. అందఱు నాత్రముతో, భయముతో, దుఃఖముతో, నచటికి వచ్చిరి. ఎవ్వరికి నేమియుఁ దోఁచుటలేదు. అందఱును దుఃఖవిహ్వలులై పోయిరి. కడకప్పాజీపంతు యించుక ధైర్యము దెచ్చికొని యిట్లనియెను. "ఇందు జబ్బేలాటిదో వివరించలేదు. కాని వ్యాధి భయంకరమైనదనియు, చికిత్స జరుగుచున్నదనియు మాత్రమే యున్నది. కాఁబట్టి మనము టెలిగ్రామిచ్చి పై సంగతులు తెలుసుకొనుట కంటె నే నే స్వయముగా నిప్పుడే మన డాక్టరు త్ర్యంబకరావుని వెంటఁగొని బరోడాకుఁ బోయిన బాగుండును." ఈ సలహా యందఱకు సమ్మతమయ్యెను. వెంటనే బరోడాకుఁ బ్రయాణసన్నాహము కావింపసాగెను. తమ కుటుంబ వైద్యుడును, పరమ మిత్రుడునునగు డాక్టరు త్ర్యంబకరావునకీ యుదంతమంతయుఁ దెలుప నాతఁడును బ్రస్తుత స్థితిగతుల నెఱిఁగి బరోడాకు వెడల సిద్ధమయ్యెను. వారు మధ్యాహ్నపు బండికి బయలుదేర నిశ్చయించిరి.

బయలుదేరు వేళ కింక నొక్క గంటకు ముందుగ మఱొక తంత్రీవార్త వచ్చెను. అప్పుడు మాత్ర మాతని కొదవిన దుస్థితి వర్ణింప లేము. కవరు విప్పుటకైనను నాతనికి వ్రేళులలో శక్తి యుండలేదు. ధైర్యము నశించెను. దేహమంతయు గడగడ వడఁకుచుండెను. ఒక నొకా యున్మత్తుని వలె, భ్రాంతునివలె నైపోయెను. ఇంక నింట నాఁడువారి బాములు చెప్పనక్కరయే లేదు. వృద్ధ



రమాబాయి కమలను దన చెంతకుఁ దీసికొని "ఏడువకు తల్లీ, మంచి మందు లిప్పించినఁ ద్వర లోనే నిమ్మళించునులె ?" యని యోదార్చు చుండెను. కాని, యామెస్థితి యెట్టు లుండెనో యామెకే తెలియును ! ఆమె కన్నులలో నొక్క బొట్టు నీరైన లేదు. కాని కన్ను లెఱ్ఱబడి వాచి యుండెను. లక్ష్మీబాయి శూన్యాంతఃకరణముతో భర్తృ నిస్తేజ ముఖమువంకఁ గాంచుచు బిచ్చ పాటుతో నిలిచి యుండెను. ఆమె కన్నుల నశ్రువులు ప్రవహించు చుండెను. ఇఁకఁ గమలస్థితి వర్ణింపనలవిగాదు ! అప్పాజీపంతున కా తంతి చదువుటకుఁ దోఁచలేదు; తోఁచినను ధైర్య మొదవలేదు. రమాబాయి కుమారుని సమీపించి "అప్పా, నుదుటి వ్రాఁత తప్పింపజాలము కదా ! వ్యర్థముగా మనసున కీ బాధయేల ? దీనిలో నేమున్నదో చదివి చూడుము. ఏమున్న మాత్ర మేమి చేయగలము ? ఎట్లును నీవు బరోడాకు ..."

ఆపైఁ బలుక లేకపోయెను. కంఠము రుద్ధ మయ్యెను. అటు పిమ్మటఁ బంతు బహుకష్టముతోఁ జెదరియున్న ధైర్యమును మరల నొక్కటిగఁ జేర్చి కొని ఆ టెలిగ్రామును జదివెను. అంతే; నిశ్చలుఁడై పోయెను; నిస్తేజుఁడై పోయెను. తలపైఁ బెద్దబండ పడి నట్లయ్యెను. తటాలునఁ గుర్చీలో బడిఁ పోయెను. దుఃఖావేశమున నాతఁ డేడ్చుటకును మరచిపోయెను.

ఈతని యీ భయంకర స్థితిఁగని యందఱును నిజము తెలిసికొనిరి. గృహమంతయు రోదన ధ్వనితో నిండిపోయెను. కమలయే యొకానొక పశువువలె పెనుబొబ్బలు పెట్టి యేడ్వసాగెను. వృద్ధ రమాబాయికి యుదంతము తెలిసిన వెంటనే యామె పెద్ద పెట్టున నవ్వసాగెను ! నోటికి వచ్చినట్లెల్ల వదరసాగెను. ఆకస్మిక భయంకర దుఃఖాహతి నున్మాదినియై పోయెను !

ఇప్పటి యీ వృత్తాంతము వర్ణించుటకు మా లేఖిని ముందుకు సాగ నిరాకరించినది.

అప్పాజీపంతుగారి గృహముపై నేఁడు దుఃఖ మహాపర్వతము. అందఱు నా కొండక్రిందఁ జిక్కి కొనిరి. కమల యాకస్మికంగా దుస్సహ దుఃఖ సముద్రమున మునిఁగి పోయెను. ఆమె సౌభాగ్య రవి యస్తంగతుఁడయ్యెను ! దుర్భరవైధవ్య మీ బాలిక కింతలోనె సంప్రాప్తమైనది ! దుర దృష్టము !

* * *

అప్పాజీపంతుగారి యింటిపై నిట్టి మహత్తర దుఃఖ పర్వతము కూలిన యా దినము మనకు హైందవులకుఁ బరమ పవిత్రమైన, మహోత్సవ దాయకమైన నరక చతుర్దశి యని పాఠకులుఁ దెలిసియే యున్నది. దీపావళి పండుగ మన కెంతటి యానందదాయకమైన పండుగైనది మన కందఱకుఁ దెలిసిన విషయమే ! అట్టి యీ యానందోత్సవ దివసమున సైతం కొందఱు వీణా వేణుగానా కర్ణనమునఁ దల్లీనులై యుండ, మఱి కొంద ఱాప్త బంధుజన వియోగమునకై రోదనము సల్పుచుందురు. దైవచిత్రము లిట్టివే !

పూనహా నగరమున సకల దిశల యందును నానందమహోత్సవములు తాండవమాడు చుండెను. ఆ నగరమున నివసించుచున్న మన యప్పాజీ పంతు గారియింటఁ గ్రూరుఁడగు కాలుఁ డానాఁడె తన సామ్రాజ్యమును స్థాపించెను !

నాలుగు దినములు గడచినవి. వీరందఱకు దుఃఖా వేగ మించుక తగ్గెను. కాని, పాపం, దీనా నాథయగు కమల యొక్క వదనము దుఃఖ పూర్ణమై, వివర్ణమై, మలినమై యుంటఁ గని యెల్లర డెందమును నీరగుచుండెను ? తమ యొక్కతయగు కూఁతున కింతలో నిట్లు దుస్సహ వైధవ్యము పిట్ట పిడుగుగఁ దలపైఁ బడుట జూచి యే తలిదండ్రుల హృదయములు విదీర్ణములు కాకుండఁగలవు ? డాక్టరు పచరించుటచే వృద్ధ రమాబాయి కించుక నిమ్మళముగ నుండెను. కమల మొదట రెండు మూఁడు దినము లొక్క మెతుకన్నము - అన్న మేల ? ఒక్క గ్రుక్కెఁడు నీరైన — దీసికొనక పోవుటచే మిక్కిలియు నశక్తయై పోయెను ! మాటలాడుటకు నామెకుఁ ద్రాణలేదు. ఆమె యింత వఱకును నెట్లు జీవించి యున్నదియా యనియు నాశ్చర్యము కలుగక పోలేదు ! ఆ సమయమున డాక్టరు త్ర్యంబకరావు గారు మాత్రం లేకుండిన నిజముగానె యాబాల జీవించియుండదు. అతఁ డీమె యెడల నధిక శ్రద్ధ వహించి యుపచరించుట చేతనె యామె జీవించినది.

అయిదవ దినము తెల్లవారెను. ఉదయ మేడు గంటలుండును. అప్పాజీపంతు తన ప్రాతఃకృత్య ములు నెరవేర్చి దేవదర్శనముఁజేసి యప్పుడే పంచపాళిలో వచ్చి కూర్చుండియుండెను. అతని దృష్టి బయట త్రోవపైఁ బారెను.

ఇంటి ముందర నొక బండి యాఁగెను. అందుండి యిరువదినాలు గిరువదైదేఁడుల యువకుఁ డొకఁడు దిగి చేత నొక చిన్న పెట్టెఁ బట్టుకొని బండివానికి నద్దెయిచ్చి మెల్ల మెల్లఁగ నప్పాజీపంతు నింటిలోనికి వచ్చుచుండెను. అప్పాజీపంతు తన క్షీణనేత్రములను వికసింపఁ జేసి శంకి తాంతఃకరణముతో నేకాగ్రదృష్టులతో నా యువకునిఁ గాంచుచుండెను. అతనిడెందమున ననేకవిధవిచార వికారము లొక్కపెట్టున వ్యాప్త మయ్యెను. అప్పుడాతఁడు భ్రాంతిగొన్న వానివలెఁ జూపట్టెను. ఆ యువకుఁడప్పాజీ పంతును సమీ పించి హసన్ముఖుఁడై గౌరవ ప్రేమ పూర్వ కముగా నా వృద్ధునకు వంగి నమస్కరించెను. అతని యెదుట నిలిచెను. ఆ యువకుని ననిమేష లోచనములతో నప్పాజీపంతు చూచుచు నిలిచెను. అతని శరీరమున బులక లుదయించెను. తనకే దైన భ్రమ కలిగెనేమో యని యతనికి శంక వొడమెను. ఉన్మత్తునివలె నైపోయెను. యువ కుని తెప్పవేయక చూచుచుండ నాతని నోట నాక స్మికముగా "నేను గలఁగనుచుండలేదు కదా ?" యను వాక్యము వెలువడెను.

ఈతని యీ విచిత్రావస్థ, శుష్కశరీరము, వాడి యున్న రూపము, నసంబద్ధ వాక్యములు గని యా యువకుని హృదయమున ననేకశంక లుద యించెను. దేహము వణఁకసాగెను ! అతఁడు కరుణా పూర్ణ స్వరమున "నిదేమిట్లు పలుకు చున్నారు ? మీ యీ—"

అప్పాజీపంతీ వాక్యముఁ బూర్తిసేయ నీయ కయె యిట్లనెను: "నీవు నిజముగానె వినాయక రావేనా ? లేక, యీ భయంకర దుఃఖా ఘాతము వలన నా మతి చలించినందున నాకిట్లు కనబడుచున్నదియా ?" యనెను.

ఈ తుది వాక్యములు విని వినాయకుని హృదయము కరఁగిపోయెను ! భయవిహ్వల స్వరమున నాతఁడు "ఎట్టి దుఃఖా ఘాతము ? నాకేమియుఁ దెలియకున్నదెట్లు? నేనిదే కొంకణము నుండి యిప్పుడే వచ్చుచున్నానే" అనెను. ఇంతలో వేఱొక యాలోచన యతనికిఁ బొడమెను.

"ఇచటఁ గూడ నేదియో భయంకర విష యము జరిగియుండవలయును" అని యతఁడు తనలోఁ దర్కించుకొనెను. క్షణార్ధకాలమున నీ యూహ నిజమని రూఢియయ్యెను. కొంచెము ధైర్యము కలిగెను. అతఁడు శాంత ముతో నిట్లులనెను—

"ఇచట జరిగినవన్నియు నా యూహనుబట్టి తెలిసికొంటిని. అదియె నిజమనియుఁ దోఁచు



చున్నది. ఇంటి నుండి బరోడాకు నాకేవిధముగ టెలిగ్రాం వచ్చెనో, ఆ విధముగనె యిటఁగూడ నేదియో కలిగియుండ వచ్చును. నిజమేనా ? మీ కిచట టెలిగ్రాం గాని, జాబుగాని వచ్చియుండెనా ?"

అప్పాజీపం తిప్పుడించుక శాంతి వహించెను.

"నీ కింటి నుండి యేమని తంత్రీవార్త వచ్చినది ?"

"మా యమ్మగారికిఁ జాల జబ్బుగా నున్నదని, నేనిక్కడికి ధనత్రయోదశీ రాత్రికి రావలెనని నిశ్చయించితిని. ఆ ముందటినాఁడె 'అమ్మ భయంకర రోగ పీడితయైయున్నది. తత్‌క్షణము రావలె' నని యమున పేరిట నాకుఁ దంతివచ్చినది. ఆ కారణమునఁ నే నిక్కడకు వచ్చుట మాని కొంకణమునకుఁ బోయితిని అప్పుడు నేను మీకు టెలిగ్రా మంపియుండవలసినదే కాని యమ్మగారి వ్యాధి విషయమై మనసు కలవరపడి యుండుటచే నాకా మాట తోఁచినది కాదు. ఆ వెంటనే సెలవు దీసికొని కొంకణమునకుఁ బోయితిని. అక్కడి నుండి యింటికిఁబోవుటకు రెండు దినములు పట్టును. అమ్మను జూడఁగలుగుదునా లేదా యని మనసు తల్లడిల్లి పోవుచుండెను. ఇల్లుచేరి చూతుఁగదా మా యమ్మ నరకచతుర్దశియగుటచే ఉదయ స్నానముచేసి పూజచేసి కొనుచుండెను. అప్పుడు నా కత్యాశ్చర్యమయ్యెను. ఇది యేమి గొడబంగాళము ! ఏమియుఁ దెలియదు ! విచారింపఁగా మా యమ్మ రోగగ్రస్తయే కాలేదని తెలియవచ్చెను. ఇంటిలో నుండి యెవ్వరు నాకుఁ దంత్రీవార్త పంపియుండ లేదఁట ! ఈ కార్యమే వివేకశూన్యుఁడో, ఏ ఖలుఁడో చేసియుండ వలయునని స్పష్టమైనది. వాని నేవిధముననైన శిక్షింపక మాననని నిశ్చయించితిని. మా యూరికిఁ దంత్రీవార్తా కార్యాలయ మిరువది మైళ్ళ దూరమునసున్నది. అచటికి బోయివచ్చుటకు రెండు దినములు పట్టును. అక్కడికిఁ బోవలెనన్న రెండెడ్ల నాటుబండ్లలోనో, లేక నడచియో పోవలెను. అందునకును సమ్మతించితిని. కాని మాయమ్మ నన్ను బయటికిఁ బోనీయదయ్యెను. అదియు సమంజసమే. దీర్ఘకాలానంతరము నేనింటికి వచ్చుట, అందునను దీపావళీ మహోత్సవ సమయమున నన్నెట్లుపోనిచ్చును ? ధనత్రయోదశీ రాత్రి కిక్కడికి వత్తునని తంతిపంపితిననియు, నటు రాకపోవుటచే మీరందఱు విచారపడుదురనియు, మీకొక తంత్రీవార్తఁ బంపి, యిట్టి టెలిగ్రాము నాకెవ్వరు పంపిరో కనుఁగొనవలయుననియు, మాయమ్మకుఁ జెప్పితిని. ఎంత చెప్పినను వినదు. "రెండు దినములు విచారింతురు ! క్షేమసమాచారముఁ దెలుపుచు నొకజాబుఁ బంపినఁ జాలును !" అన్నది, అందుపై మీ కొక జాబు వ్రాసితిని." అని యనుచునుండఁ దపాలాభటుఁ డొకజాబుఁ దెచ్చి యప్పాజీపంతున కిచ్చెను. వినాయకుఁ డా జాబుఁ గాంచి "యిదియె నే వ్రాసిన" జాబనెను. "నేను జాబు వ్రాసితిని గాని, యది మీకుఁ జేరుటకు మూఁడు నాలుగు దినములగునని నేనెఱుఁగుదును. ఆ జాబు మీకుఁ జేరు



వఱకు నెంత యాతురపడుచుందురో, యని నాకుఁ దోఁచి, మాయమ్మతో నట్లే చెప్పితిని; సమాధాన పరచితిని. ఆ సాయంకాలమె నేను బయలుదేరితిని. ఇప్పుడు వచ్చి చేరితిని. ఆ రెండు దినములలోఁ దంత్రీవార్తాధికారికి జాబులు వ్రాసి, నాకు వచ్చిన టెలిగ్రాములు పంపి, యిట్టి నీచకృత్యము సేసిన దెవ్వరో తెలుపుఁడని కోరియుంటిని. అనుభవము తప్పదందురు కదా ? ఇది నిజమని నాకుఁ దెలియ వచ్చుచున్నది. తంత్రీవార్తాధికారికి టెలిగ్రామిచ్చి నప్పుడే నా క్షేమసమాచారముఁ గూర్చి మీకు నొక టెలిగ్రా మంపవలసియుండెను. నా మనస్సు స్థిరముగ నుండకపోవుటచే నప్పుడు నాకా మాట తోఁచలేదు. నే నంపిన తంతికి బదులు నేను బయలుదేరు వేళకే వచ్చిచేరినది. నాకుఁ జేరిన టెలిగ్రాము యమున పేరున నుండె ననియు, రాము అనునాతఁడు తెచ్చెననియు, గార్యాలయాధికారి నాకుఁ దెలిపెను. మన యిక్కడి కృష్ణరావునకు రాము అను ప్రాణమిత్రుఁ డొక డుండుట మన మందఱ మెఱుఁగుదుము గదా ! అతఁడు కొంకణమున కేదో పనియుండి పోయి యుండెనని నన్నెఱిఁగిన యొకఁడు నాతోఁ జెప్పెను ఇవియన్నియు యోచింపంగా నీ కృత్య మంతయును నీ నీచుఁడు కృష్ణరావు ప్రోత్సాహ మున రాముఁడు చేసియుండవలయునని తేటపడు చున్నది.

ఈ వృత్తాంత మంతయును జెప్పి, యిచటికత లెఱుఁగు నాతురముతో వినాయకుఁ డప్పాజీ పంతును జూచెను. ఈతఁడు నుడివిన దంతయు విన్న పిదప నప్పాజీగారి హృదయమందలి సంశ యాంధకారము మాయమై పోయెను ? సకలో దంతము నీతఁడు వినాయకునకు వినిపించెను. అప్పుడాతని సంశయము దృఢపడియెను !

కమల నెప్పుడు దర్శింతునా, యని వినాయక రావాతురపడుచుండెను. కాని, ప్రస్తుత మామె యున్న స్థితి గతుల నెఱిఁగి, యిప్పు డాతుర పడిన నామెకు హర్షవాయువు కలుగునేమో యని వెఱచి, క్రమముగ సకల వృత్తాంతములు నామెకుఁ దెలుపవచ్చునని తలఁచెను. అప్పాజీ పంతు తనకు వచ్చిన టెలిగ్రామును దెచ్చుటకై లోని కరిగెను.

లక్ష్మీబాయి వంటయింటఁ గమల కౌషధ మిచ్చుచుండెను. పంతచటి కరిగి "ఇదిగో యిప్పుడింటికి వచ్చిన వారెవరో చూచితివా ? వినాయకుడు - మన వినాయకరావు వచ్చి యున్నాడు. శీఘ్రముగాఁ దేనీరు కాఁచి తెమ్ము. మన వినాయకరావు వచ్చియున్నాడు - వినాయక రావు !"

అని వచించి యప్పాజీపం తచ్చోటువాసి బయటి కరుదెంచెను. ఈతని యానంద పూరిత మగు కంఠస్వరమును, హసన్ముఖమును లక్ష్మీ బాయి యాశ్చర్య చకితలోచనములతో జూచెను. ఆమె స్థితియు విచిత్రముగ నుండెను. అప్పాజీ పంతునకుఁ దొలుత నేవిధముగ సందేహ మొద వెనో యామెకు నావిధముగనే సందియము పొడ మెను ! దుఃఖభరమున నతఁడు భ్రమించియుంద

లేదకదా! "అన్నఁగా?" నని యామె భర్త నడిగెను. కాని, ప్రత్యుత్తర మిచ్చుటకు భర్త యందుండలేదు. చేతనున్న పనినట్లే వదలి యామె బయటికి వచ్చెను. ఈమెను గాంచినంత వినాయకరావు నవ్వుచు "అత్తా, నేను స్వర్గస్థుఁడ నైతినని మీరందఱు నతిశయముగ దుఃఖించు చుందురని, మిమ్మోదార్చుటకై యొక్కమారు మిమ్మందఱఁ జూడఁగోరి స్వర్గావరోహణ మొనర్చి వచ్చియున్నాను" అనెను. ఇదేమి చిత్రము! ఏమి మాయ? లక్ష్మీబాయి కిడియేమియు, తెలియ లేదు. తెప్పమూయకయే యతనిఁ గాంచుచు నిలిచెను; తడ వీమెను సంశయాందోళనమున ముంచుట తగదని యప్పాజీపంతు యథార్థ మంతయుఁ దెలిపి "ఇదిగో అమ్మతో నీసంగతు లేవియుఁ జెప్పకుమా! ఈ యానందభారమామెకు మిక్కుటమై మరల భ్రమించి పోవునేమో! పో, పోమ్మ. శీఘ్రముగా తేనీరు కాచితెమ్ము! చాల నలసియున్నాఁ" డనెను.

లక్ష్మీబాయి హృదయ మత్యంతానంద ప్రపుల్ల మయ్యెను. పతి సూచించినట్లు తేనీరు కాచుటకామె వెడలిపోయెను.

వినాయకరావు తంత్రీవార్తాపత్రికను బరీక్షా పూర్వకముగాఁ దిలకించుచుండెను, "దీనిలో మనోహర పంతని వ్రాలున్నది. ఈతఁడెవ్వడో? నిజమగు వ్యక్తియో లేక కల్పిత వ్యక్తియో తెలియుట లేదు. మా స్నేహితులలో నీ పేరువా రెవరును లేరు. కొంకణమునుండి నాకుఁ బంపిన మరునాఁడె మీకీవార్త పంపఁబడియున్నది. సరే, దీని జాడయుఁ బూర్తిగానె తెలియఁగలదు! బరోడా తంత్రీవార్తాధికారి నాకుఁ జిరపరిచితుఁడు! అతనికి వ్రాసినచో సకలము నిజము తెలియఁ గలదు!" అని యనుచునుండ వీరిద్దఱకు "టీ" త్రాగుటకు లోపలనుండి పిలుపు వచ్చెను. వీరిద్దఱు మాట్లాడుచునే తేనీరుఁ గ్రోలుచుండ, లక్ష్మీబాయి కమల గదిలోని కరిగెను. కమల యప్పటి కింకను నిద్దుర మేల్కొని యుండలేదు. ఆమె కిటీవల రాత్రులలో నిద్రపట్టుటలేదు. కాని, తెల్లవారుజామునఁబట్టును.. ఈ యుదయమెందెక్కువలకు మేల్కొనుట లేదు. లక్ష్మీబాయి మెల్లఁగ నామె మంచము చెంత కరిగెను. మెల్లఁగఁ దట్టి లేపెను. వినాయకుని వృత్తాంత మంతయుఁ గొంచెము కొంచెముగా నామెకుఁ దెల్పి వినాయకుఁ డరుదెంచినాఁడనియుఁ దెలిపెను. ఆ యకల్పితానందమున స్వర్గమున కరిగిన తన పతి మరల నరుదెంచుట యను నమృతముకన్న నధిక మధురవార్త విని కమల కేమితోఁచియుండునో, యామె హృదయ స్థితి యెట్లుయి యుండునో, యూహించు భారము పాఠకులపై మోపు చున్నాము.

అనంతర మీ యానందవార్తఁ దెలుపుటకై యప్పాజీపంతు త్ర్యంబకరావుగారి గృహమున కరిగెను.

వినాయకుఁ దరుదెంచినకాలమున వృద్ధ రమాబాయి యింట నుండలేదు. కొంతసేపటికి వచ్చెను. త్ర్యంబకరావుగారి శ్రద్ధాభక్తులవలన నామె నెమ్మదిగా నుండెను. నిన్నటి నుండియు యామె లేచి తిరుగుచుండెను. ఆమె వంటయింట నుండెను. లక్ష్మీబాయి కమలను వదలి వంటయింటి కేతెంచెను. ప్రేమాదఃఖస్వరమున నామె మెల్ల మెల్లఁగ నా ముదుసలి మనసున కాయాస మొదవికుండునట్లు సకలము నివేదించెను.

కమల యానందమునకు మేరలేదు. ఆమె రూపమునను మార్పు కనుపట్టెను. ఒక్క క్షణ కాలమునకుఁ బూర్వముండిన ప్రేతకళ మాయమై పోయి యామె ముఖమండలమున నానందాపుణ కళలు నెలకొనెను. జలమున, స్థలమున, కాష్ఠమున, పాషాణమున అన్నిటియందును నానందము దృగ్గోచరము కాసాగెను. ఆ వెంటనే యా బాల లేచిపోయి, ప్రాతఃకృత్యములు నెరవేర్చి కచేరి చావడి కరుదెంచెను. అచట వినాయకరావొక్కఁడె వార్తాపత్రికఁ జదువుచుఁ గూర్చుండి యుండెను కమల తన కనుదమ్ములను వికసింపఁ జేసి, యాతురముతో, నాతని జూచుచు నిలుచుండెను. ప్రేమానందములు ప్రబలమై యామె దిఙ్మూఢయైపోయెను! నోట మాట వెడలదు! ఈ వికార మామె శరీరమంతటను గగుర్పాటొదవించెను; నేత్రకమలములు నాలుగును ముకుళితము లయ్యెను! కను మూయునంతలో నామె వినాయకుని బాహుపంజరమున బద్ధయై పోయెను!

ఇచట రమాబాయియు నానంద తన్మయయై పోయెను. ఆమె వినాయకుఁ డున్నెడకుఁ బోయి, పరస్పర బాహుపంజర బద్ధులై యుండునా యిద్దఱు నిట్లే కౌగిఁలించి, ప్రేమానందాశ్రువుల నాయిద్దఱకు మంగళ స్నానముఁ గావించెను.

అప్పాజీపంతున కీదినమె దీపావళీ మహోత్సవమయ్యెను. వినాయకుడు బరోడాతంత్రీ వార్తాకార్యాలయాధికారి యగు శ్రీధరపంతున కంపిన తంతి కా మరునాఁడె జవాబువచ్చెను. సవిస్తరముగఁ దంతినొసఁగుట కలవికానందున లేఖయే వ్రాసియుండెను. అం దిట్టులుండెను:

"అప్పాజీ పంతులుగారి కొకటివెంట నింకొకటిగాఁ బంపిన రెండు తంత్రీసందేశములుఁ గొని కృష్ణరావు దేశాయి యను గృహస్థుఁడు తానె స్వయముగాఁ దెచ్చి యుండెను. వానిపై 'మనోహరపం' తని వ్రాలుండెను కృష్ణరావు పక్షముదినముల క్రిందట నీయూరునకు వచ్చిన 'శ్రీ సంగీత నాట్యసమాజము' వారితోఁగలిసి వచ్చియుండెను. నాకతనితో బరిచయము లేదు. ముఖపరిచయమే. అన్నియుఁ దిన్నఁగా విచారణ సేయఁగాఁ దెలిసిన విషయము లివియే."

ఈ విషయముఁ జదివి వినాయకున కింకనొకటి జ్ఞప్తికివచ్చెను. ఈ కృష్ణరావు బరోడాకు నటకులతో వచ్చియుండుటచే, నాతఁడు తరచుగాఁ దనకడకు వచ్చుచుండెను. అట్టి సమయములలో నొకనాఁడు మాటలవరుసను "నేను దీపావళీ పండుగ కింటికివచ్చెద" ననియుండెను. కావునఁ దానేనాఁడు బయలుదేరినదియు జాడతెలిసి యీ కృష్ణరావీకృత్స్నకృత్య మొనర్చి యున్నాఁడని తేటపడెను. ఇది యిట్లని యప్పాజీపంతునకుఁగూడ వినాయకుడు తెలిపెను! కమల కృష్ణుని ప్రేమ నిరాకరించి, ప్రేమభంగ మొదవించియుండినందున నామెప్డుఁ దీర్ఘకాలవైధవ్య దుఃఖ మొదవించి, యీరీతిని దనసూఁడు తీర్చుకొనెను! మనస్సమాధానముఁ గావించుకొనెను! కాని, ఇందున వాని మనసున కెంతటి సమాధాన మొదవి యుండునో దైవమెఱుగును!

పౌరాణిక కృష్ణలీలలు మనమందఱముఁ జదివి యున్నాము. కాని, మన ఈ యాధునిక కృష్ణలీలలకు, నాలీలకు నెంత భేదమున్నదో యాలోచింపుఁడు!

అప్పాజీ పంతుగారి గృహమున నందఱకు-అందు ముఖ్యముగా గమలకు భీషణాంధకార భరితమైన యమావాస్యనిశవలె దుర్భర దుఃఖమయ కాళరాత్రి సమాప్తిచెంది ఆనందమయ సుప్రభాతమయ్యెను. ఈ సుప్రభాత సమయమునఁ బ్రశాంతమును, తేజోమయమును బాలారుణ సువర్ణకిరణ ప్రసారముల నప్పాజీపంతుగారి కుటుంబము విలసిల్లెను! □

(ఈ కథ 1927 ఫిబ్రవరి భారతిలో మొదటిసారిగా ప్రచురింపబడింది!)